
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



మళ్లీ కుండపోత



బ్రాహ్మణపల్లె: వక్కిలేరు వరదని దాటుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

- భారీ వర్షాలతో కుదేలైన రైతులు
- తడిసిన మొక్కజొన్న, ఉల్లిగడ్డలు
- నీట మునిగిన వరి, మినుము పంటలు
- పొంగి ప్రవహిస్తున్న వక్కిలేరు

చాగలమర్రి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ శాంతించాక రెండు రోజులు తిరగక ముందే మంగళవారం తెల్లవారుజామున మళ్లీ కుండపోత వర్షం కురిసింది. జిల్లాలోని వివిధ మండలాల్లో పంటలు నీట మునిగాయి. వాగులు, వంకలు ఉప్పొంగాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మండలంలోని చింతలచెరువు, కొలుములపేట, ఆవులపల్లె గ్రామాల పొలాల్లో కోసి ఆరబెట్టుకున్న ఉల్లిగడ్డ దిగుబడి తడిసిపోయింది. .కొందరు రైతులు కోసిన ఉల్లిగడ్డలపై పట్టాలు కప్పినా ఫలితం కనిపించలేదు. చేతికి వచ్చిన పంట దిగుబడి తడిసి రైతులు భారీగా నష్టపోయారు. అసలే ధరలు లేక అల్లాడుతుంటే ఈ వర్షం మరింత నష్టపరిచిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. చింతలచెరువు, కొలుములపేట, మూడురాళ్లపల్లె, గొట్లూరు, నేలంపాడు తదితర గ్రామాల్లో మినుము పంట నీట మునిగిపోయింది. వరుస తుఫాన్‌లతో పంటలు దెబ్బతిని భారీగా నష్టపోయామని రైతులు వాపోతున్నారు. బ్రాహ్మణపల్లె, కలుగొట్లపల్లె గ్రామాల వద్ద వక్కిలేరు పొంగి ప్రవహించింది. బ్రాహ్మణపల్లె వక్కిలేరుపై వరద పెరుగుతుండటంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ఏరు దాటించేందుకు అవస్థ పడ్డారు. వరుస తుఫాన్‌లతో భారీగా నష్టపోయామని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



ఉయ్యాలవాడలో మిరప పంటలో నిలిచిన వర్షపు నీరు

ఉయ్యాలవాడ మండలంలో భారీ వర్షం

ఉయ్యాలవాడ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మంగళవారం తెల్లవారు జాము నుంచి మండలంలో భారీ వర్షం కురిసింది. 16.8 మి.మీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది. ఉయ్యాలవాడ, ఆర్.పాంపల్లె, పడిగెపాడు, హరివరం, కొండుపల్లె గ్రామాల్లో రైతులు సాగు చేసిన మిరప, పత్తి పొలాల్లో నీళ్లు నిలిచాయి. సర్వాయిపల్లె గ్రామంలోని ఊరి వాగు ఉప్పొంగి ప్రవహించింది.



సర్వాయిపల్లెలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు



కొలిమిగుండ్ల సమీపంలో శనగ పంటలో నిలిచిన నీరు

మళ్లీ వాన

కొలిమిగుండ్ల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలో సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం సాయంత్రం వరకు 6 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. పలు చోట్ల పంట పొలాల్లోకి నీరు చేరడంతో పంటలు మునిగిపోయాయి. ఈ వానలు రబీ సాగు మీద తీవ్ర ప్రభావం చూపే పరిస్థితి నెలకొంది.



కొలుములపేటలో నీట మునిగిన మినుము పంటను చూపిస్తున్న రైతు

రైతులను ముంచిన అకాల వర్షం



మొక్క జొన్న ధాన్యంపై వర్షపు నీటిని బిందెలతో తోడేస్తున్న రైతులు

నందికొట్కూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలతో చేతికొచ్చిన పంటలు తడిసి ముద్దకావడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. మొంథా తుఫాన్ నుంచి తేరుకోకముందే మంగళవారం మధ్యాహ్నం నందికొట్కూరు పట్టణంలో కురిసిన భారీ వర్షానికి కల్లాల్లోని మొక్కజొన్న ధాన్యం తడిసి పోయింది. కల్లాల్లో ఆరబెట్టుకున్న ధాన్యాన్ని కుప్పలు చేసి, టార్పాలిన్లను కప్పే ప్రయత్నం చేశారు. అయినా మొక్క జొన్నలు తడిసిపోయాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. అసలే అరకొరగా దిగుబడి వచ్చిందనుకుంటున్న స్థితిలో ఈ విపత్తుతో తల్లడిల్లిపోతున్నారు.

కూలీల అదనపు ఖర్చు



అకాల వర్షాలతో మొక్కజొన్న ధాన్యాన్ని ఆరబెట్టేందుకు కూలీల ఖర్చు అదనంగా వచ్చింది. 10 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశాను. 10 నుంచి 12 క్వింటాళ్లు కూడా వచ్చేలా లేదు. కల్లంలో ధాన్యాన్ని ఆరబెడుతున్న సమయంలో ఎప్పుడు వర్షం వస్తుందో తెలియక 8 మంది కూలీలను ఏర్పాటు చేశాను.

● రామకృష్ణ, రైతు, నందికొట్కూరు

అంతా తడిసిపోయింది




ఉన్నట్లుండి వర్షం రావడంతో కల్లంలో ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. ఈ ఏడాది మొదటి నుంచి అధిక వర్షాలు మొక్కజొన్న పంటను దెబ్బతీశాయి. ఎకరాకు రూ.40 వేలు ఖర్చు చేశాను. దిగుబడి కేవలం ఎకరాకు 10 క్వింటాళ్లు వచ్చే పరిస్థితి లేదు. ధాన్యం తడిసిందని, ధర లేదంటూ దళారులు, వ్యాపారులు రూ.1800 కొంటున్నారు.

● రంగన్న, రైతు, నందికొట్కూరు

రమణీయం.. ప్రహ్లాదరాయల తెప్పోత్సవం

● మయూరి వాహనంపై విహారం



ప్రహ్లాదరాయలకు తెప్పోత్సవం

మంత్రాలయం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలో ప్రహ్లాదరాయలు పుష్కరిణిలో తెప్పోత్సవంపై రాత్రి రమణీయంగా నిర్వహించారు. మంగళవారం రాఘవేంద్రస్వామి మఠంలో కార్తీక పౌర్ణమి శుభదినాన్ని పురస్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆధ్వర్యంలో మూల బృందావనానికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రహ్లాదరాయలకు పాద పూజచేసి పల్లకిలో అధిష్ఠించి రమణీయంగా ఊరే గించారు. వేదపండితుల మంత్రోచ్చరణాలు, మంగళవాయిద్యాలు మధ్య శ్రీమఠం ప్రాంగణం చుట్టూ మయూరి వాహనంపై ఆశీనుడైన ఉత్సవమూర్తి పల్లకి ఊరేగింపుతో పుష్కరిణి వద్దకు తెస్తున్న దృశ్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. విద్యుత్ దీపాల వెలుగుల మధ్య తెప్పోత్సవంపై ప్రహ్లాదరాయలు విహరించారు. వివిధ రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున భక్తులు గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్రస్వామికి విశేషపూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మఠం పీఠాధిపతి భక్తులకు ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, సురేష్‌కోణాపూర్, శ్రీపతిఆచార్, దివాన్ శ్రీనాథ్ ఆచార్, సుజయీంద్ర ఆచార్, ఎస్‌ఐ శివాంజల్ పాల్గొన్నారు.

అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

● డీఎస్పీ రామాంజినాయక్



శ్రీశైలం హటకేశ్వరం వద్ద సూచనలిస్తున్న డీఎస్పీ రామాంజినాయక్

శ్రీశైలం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జ్వాలా తోరణోత్సవం బుధవారం సాయంత్రం నిర్వహిస్తున్న నేపథ్యంలో అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ రామాంజినాయక్ అన్నారు. మంగళవారం జ్వాలాతోరణోత్సవానికి చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. ప్రధానంగా వాహనాల పార్కింగ్, దేవాలయ పరిసరాలు, ప్రసాదం విక్రయ కేంద్రాలు, క్యూకాంప్లెక్స్‌ల వద్ద చర్యలు తీసుకోవాలని సూచించారు. గంగాధర మండపం వద్ద జరిగే కార్యక్రమంలో తోపులాట జరగకుండా దీపాలు వెలిగించే వేదికకు చుట్టూ రెండంచెల భద్రతా వలయాన్ని ఏర్పాటు చేయించడంతోపాటు అగ్నిమాపక దళాన్ని అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. సీఐ ప్రసాదరావు, అధికారులు ఉన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయండి

కలెక్టర్ రాజకుమారి



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ కింద గిరిజన గూడెంల్లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ రాజకుమారి హౌసింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జరిగిన సమావేశంలో పీఎం జన్మన్, ధర్తి ఆబా జంజాటియా గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ కింద జరుగుతున్న అభివృద్ధిని సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పీఎం జన్మన్ కింద మొత్తం 556 ఇళ్ల నిర్మాణాలు చేపట్టగా, ఇప్పటి వరకు 18 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయన్నారు. గ్రౌండింగ్‌లో ఉన్న 281 ఇళ్లు, ఇంకా ప్రారంభించని 257 ఇళ్లను వెంటనే ప్రారంభించాలని హౌసింగ్ పీడీని ఆదేశించారు. ధర్తి ఆబా జంజాటియా గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ కింద గులాం అలియాబాద్ తండా, రాళ్లకొత్తూరు గ్రామాలకు 116 ఇళ్లు కేటాయించబడ్డాయని వాటి నిర్మాణాన్ని పూర్తి చేయాలన్నారు. ఆయుష్మాన్ భారత్ కార్డులకు సంబంధించి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 1779 కార్డులను 15 రోజుల్లోపు పూర్తి చేయాలన్నారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వెంకటశివ ప్రసాద్, హౌసింగ్ పీడీ శ్రీహరి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

విరిగిపడ్డ కొండ చరియలు

శ్రీశైలం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్ర పాతాళ గంగ, డ్యాంసైట్ వ్యూ పాయింట్ టర్నింగ్ సమీపంలో కొండ చరియలు విరిగి రోడ్లపై పడ్డాయి. ఆ సమయంలో వాహనాల రాకపోకలు లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. శ్రీశైలం నుంచి హైదరాబాద్ వెళ్లే మార్గంలో రోడ్డుపై పడిన కొండరాళ్లను తొలగించే వరకు రాకపోకలు నిలిచిపోయాయి. వరుసగా కురుస్తున్న వర్షాల వల్ల సంభవించే ప్రమాదాల బారిన పడకుండా వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని సున్నిపెంట ఇన్‌స్పెక్టర్ చంద్రబాబు సూచించారు.



డ్యాంసైట్ వద్ద విరిగిపడిన కొండ చరియలు

నలుగురు ఎస్‌ఐలకు స్థానచలనం

కర్నూలు క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నలుగురు ఎస్‌ఐలకు స్థాన చలనం కలిగిస్తూ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ ఆదేశాలు జారీ చేశారు. ఇటీవలే వెల్దుర్తి నుంచి గూడూరు పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వచ్చిన అశోక్ పోస్టింగ్‌ను రద్దు చేస్తూ తిరిగి తాలుకా పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. అలాగే గూడూరు పోలీస్ స్టేషన్ నుంచి కర్నూలు త్రీటౌన్ ఎస్‌ఐ తిమ్మయ్య పోస్టింగ్‌ను రద్దు చేసి తిరిగి కర్నూలు టూటౌన్‌కు నియమించారు. కోసిగి పోలీస్ స్టేషన్ నుంచి కర్నూలు టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు కేటాయించిన ఎస్‌ఐ హనుమంతరెడ్డిని తిరిగి గూడూరు పీఎస్‌కు నియమించారు. తాలుకా పోలీస్ స్టేషన్‌లో ఉన్న ఎస్‌ఐ వీరయ్యను త్రీటౌన్‌కు బదిలీ చేశారు.



నేడు కార్తీక సౌరభం

ఓం నమఃశివాయ

శైవ క్షేత్రాలపై ప్రత్యేక కథనాలు 6లో

కర్నూలు కీర్తి ప్రతిష్టలు పెంపొందించేలా కళా ప్రదర్శనలు 7



శ్రీశైలానికి పోటెత్తిన భక్తులు

● స్వామివారి స్పర్శ దర్శనం కోసం బారులు

శ్రీశైలం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసోత్సవాల నేపథ్యంలో మంగళవారం శ్రీశైలానికి భక్తులు పోటెత్తారు. పౌర్ణమి ఘడియలు సమీపించడంతో ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. స్వామివారి స్పర్శ దర్శనం కోసం మూడు రోజులుగా ఎదురు చూస్తున్న భక్తులతోపాటు ఆన్‌లైన్ బుకింగ్, వీఐపీ బ్రేక్ స్పర్శ దర్శనం టిక్కెట్లు పొందిన భక్తులు క్యూలైన్లు, కంపార్ట్‌మెంట్ల ద్వారా గర్భాలయ స్పర్శ దర్శనం చేసుకునేందుకు నాలుగు గంటల సమయం పట్టింది. మధ్యాహ్నం దేవస్థానం సర్వర్ గంటకుపైగా నిలిచిపోయింది. టికెట్ స్కానింగ్ చేసేందుకు ఇబ్బందులు పడ్డారు. నిర్ణీత టైం స్లాట్‌లలో జరగవలసిన ఆర్జిత శ్రీచక్ర కుంకుమార్చనలు, వృద్ధ మల్లికార్జునస్వామివారికి అభిషేకాలకు భక్తులు సకాలంలో అందుకోలేకపోవడం వల్ల సేవల్లో పాల్గొనే అవకాశం లేకుండా పోయిందని పలువురు భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు.




క్యూలైన్‌లో స్పర్శ దర్శనానికి వెళ్తున్న భక్తులు



దర్శనం కోసం కంపార్ట్‌మెంట్‌లో వేచి ఉన్న భక్తులు








ఓం నమః శివాయ

- శైవక్షేత్రాలకు నెలవు నల్లమల
- ప్రకృతి ఒడిలో ప్రాచీన పుణ్యక్షేత్రాలు
- నేడు కార్తీక పౌర్ణమి

నల్లమల అడవులు ప్రసిద్ధ శైవ క్షేత్రాలకు నెలవు. శ్రీశైలం, మహానంది, యాగంటి, సంగమేశ్వరం, ఓంకారం, కొలనుభారతి వంటి ఆలయాలు నల్లమల ఒడిలో ఒదిగి ఉన్నాయి. శైవ క్షేత్రాలకు ఏటా పెద్ద ఎత్తున భక్తులు తరలి వస్తుంటారు. మహాశివుడికి అత్యంత ప్రీతికరమైన కార్తీక మాసం రావడంతో ఈ క్షేత్రాలన్నీ శివనామస్మరణతో ప్రతిధ్వనిస్తున్నాయి. కార్తీక సోమవారాలు, సెలవు రోజుల్లో ఈ క్షేత్రాలు భక్తులతో కిటకిట లాడుతున్నాయి. ప్రత్యేకించి కార్తీక పౌర్ణమి రోజున స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివస్తున్నారు. అక్టోబరు 21వ తేదీన కార్తీక మాసం మొదలై నవంబరు 19కి ముగియనుంది. బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా నంద్యాల జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకోనున్నాయి. ఈ శైవక్షేత్రాలకు తరలిరానున్న భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. పలు శైవక్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతోంది. రుద్రకోడూరు, నాగలూటి, చిన్నగుమ్మితం, పెద్దగుమ్మితం క్షేత్రాలకు ప్రైవేట్ వాహనాల్లో అటవీ అధికారుల అనుమతుల మేరకు వెళ్లాల్సి వుంది. నేడు కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని నల్లమల శైవక్షేత్రాలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

- ఆత్మకూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి)








శ్రీశైల మహాక్షేత్రం: ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకటైన శ్రీశైల క్షేత్రం భక్తులతో కిటకిటలాడుతోంది. భ్రమరాంబ, మల్లికార్జున స్వామి, అమ్మవార్ల దర్శనార్థం దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. పాతాళగంగలో కార్తీక పుణ్యస్నానాలు ఆచరించి భక్తులు పునీతులవుతున్నారు. క్షేత్రపరిధిలోని పలువురి దేవతామూర్తుల ఉప ఆలయాలు కొలువుదీరి ఉన్నాయి. ప్రత్యేకించి సాక్షిగణపతి, హఠకేశ్వరం, అక్కమహాదేవి గుహలు, ఇష్టకామేశ్వరి తదితర ఆలయాలతో పాటు పాలధార, పంచధార, శిఖరం, శివాజీ స్ఫూర్తికేంద్రం వంటి సందర్శనీయ ప్రదేశాలు ఉన్నాయి. క్షేత్రానికి కర్నూలు, నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు, ఆత్మకూరు తదితర పట్టణాల నుంచి ఆర్టీసీ బస్సు సర్వీసులు ఉన్నాయి. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని క్షేత్రంలో లక్షదీపోత్సవం, పుష్కరిణికి నవవిధహారతులు, జ్వాలాతోరణం వంటి క్రతువులను శాస్త్రోక్తంగా చేపట్టనున్నారు. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ఇప్పటికే దేవస్థానం అధికారులకు భక్తులకు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం క్యూలైన్లు, ప్రత్యేక లడ్డూ కౌంటర్లు, అన్నదానం తదితర వసతులను కల్పిస్తున్నారు.



మహానంది క్షేత్రం: నల్లమల ప్రకృతి అందాల నడుమ వెలసిన మహానంది క్షేత్రాన్ని నందన చక్రవర్తి కాలంలో నిర్మించినట్లు ఇక్కడి శాసనాల ద్వారా తెలుస్తోంది. అత్యంత ప్రాచీన ఈ క్షేత్రంలో కామేశ్వరీసహిత మహానందీశ్వరుడి దర్శనార్థం కార్తీక మాసంలో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తుంటారు. క్షేత్ర పరిధిలో రుద్రగుండ కోనేరులో, ఆలయ వెలుపల ఉన్న చిన్నపాటి రెండు కోనేరుల్లో భక్తులు కార్తీక పుణ్యస్నానాలు ఆచరించి భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శిస్తారు. క్షేత్ర పరిసరాలు.. నల్లమల అందాలు, ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్న ఈ క్షేత్రంలో మహానంది విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అలాగే క్షేత్రంలో భక్తులు విడిది చేసేందుకు వీలుగా ప్రైవేట్ కాటేజీలు కూడా అందుబాటులో ఉన్నాయి. నంద్యాల నుంచి ఆటోలు, బస్సులు నిత్యం క్షేత్రానికి రాకపోకలు జరుపుతుంటాయి.



పెద్దగుమ్మితం: మండల పరిధిలోని వడ్లరామాపురం గ్రామానికి 6 కి.మీ దూరంలో గల ఎత్తైన నల్లమల కొండల్లో వెలసిన గుప్త మల్లికార్జున స్వామి క్షేత్రం ఎంతో ఖ్యాతి కెక్కింది. ఇక్కడ కొలువైన ముక్కంటేశ్వరుడ్ని, ధాన్య భ్రమరాంబదేవిని భక్తితో కొలిస్తే కోరికలు సిద్ధిస్తాయన్నది భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ ఆలయం అతిపురాతనమైనది. ద్వాపర యుగంలో పాండవులు అరణ్యవాసం చేసే సమయంలో ధర్మరాజు ఈ శివలింగాన్ని ప్రతిష్ఠించినట్లు పురాణాల ఆధారంగా తెలుస్తోంది. ఆలయానికి వెనుకభాగంలో భారీ మర్రివృక్షం కూడా వుంది. ఈ వృక్షం సుమారు 400 ఏళ్ల వుండవచ్చని పెద్దలు చెబుతున్నారు. ఆలయానికి ముందుభాగంలో వున్న ఉసిరి చెట్టుపై ఒక మద్దిచెట్టు, రెండు జీవిచెట్లు వున్నాయి. ఈ క్షేత్రానికి చేరుకునేందుకు వడ్లరామాపురం, ఇందిరేశ్వరం చెంచుగూడెల నుంచి భక్తులు కాలినడకన అటవీమార్గం గుండా చేరుకుంటారు.

సంగమేశ్వరక్షేత్రం: కొత్తపల్లి మండలంలోని సప్తనదుల సంగమక్షేత్రంలో సంగమేశ్వరాలయం నదీజలాల్లో నీటమునగడంతో ప్రస్తుతం ఎగువ ఉమామహేశ్వర స్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి వేడుకలను జరపనున్నారు. క్షేత్రంలో ఎగువ పుష్కర ఘాట్ వరకు నదీ జలాలు ఉండటంతో భక్తులు సప్తనదీ జలాల్లో పుణ్యస్నానాలు ఆచరించి దీపాలను వెలిగించనున్నారు. దీంతో కార్తీక పౌర్ణమి రోజుకే క్షేత్రంలో వేపదారు శివలింగం దర్శనభాగ్యం భక్తులకు కలగనుంది. అలాగే ఎగువ ఉమామహేశ్వరాలయంలో కూడా ప్రత్యేక పూజలు నిర్వహించవచ్చు. ఈ క్షేత్రానికి చేరుకునేందుకు ఆత్మకూరు నుంచి 37కిమీలు ప్రయాణిస్తే.. ఈ క్షేత్రానికి వెళ్లవచ్చు. క్షేత్రానికి తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం కాశిరెడ్డినాయన ఆశ్రమం వారు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.






రుద్ర కోటేశ్వరాలయం: మండల పరిధిలోని నల్లకాల్వ గ్రామం నుంచి 15 కి.మీ దూరంలో నల్లమల అరణ్యంలో రుద్రకోటేశ్వరాలయం వెలసింది. పూర్వం ఈ క్షేత్రంలో పరమేశ్వరుడు స్వయంభూ లింగ రూపంలో వెలసినట్లు పురాణ ఇతిహాసాలు చెబుతున్నాయి. ప్రతి ఏడాది మహాశివరాత్రి, కార్తీక పౌర్ణమి రోజునభక్తుల పెద్దఎత్తున తరలివచ్చి రుద్రకోటేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ప్రస్తుతం రుద్రకోటేశ్వరాలయం చేరుకునేందుకు అటవీ మార్గంలోని మూడు వాగుల్లో నీటి ప్రవాహం ఉంది. ట్రాక్టర్ల ద్వారా అటవీ శాఖ అనుమతుల మేరకు క్షేత్రానికి వెళ్లాల్సి ఉంది. ప్రస్తుతం క్షేత్రానికి చేరుకునేందుకు అటవీ ప్రాంతంలో వాగులు అడ్డంకిగా మారాయి.

ఓంకార క్షేత్రం : జిల్లాలోని బండిఆత్మకూరు మండలంలో వెలసిన ఓంకార క్షేత్రం కార్తీక మాస శోభ సంతరించుకుంది. చాళుక్యుల కాలంలో క్షేత్ర నిర్మాణం జరిగినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. కార్తీక మాసోత్సవాన్ని పురస్కరించుకుని క్షేత్రంలో వెలసిన గంగా ఉమాసమేత సిద్ధేశ్వరస్వామి దర్శనార్థం భక్తులు విశేషంగా తరలివస్తుంటారు. అలాగే ఎగువ ఉన్న కొండపై కాశీవిశాలక్ష్మీ అమ్మవారి ఆలయం, వేంకటేశ్వరుడిని సన్నిధితో పాటు పలువురి దేవతామూర్తుల విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. దిగువ క్షేత్రంలో వున్న కోనేరులో భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తారు. క్షేత్రానికి వచ్చే భక్తులందరికి కాశిరెడ్డినాయన ఆశ్రమం తరపున నిత్యాన్నదాన సత్రం నిర్విరామంగా కొనసాగుతోంది. మండల కేంద్రమైన బండిఆత్మకూరు నుంచి 12 కిమీల దూరంలో వున్న ఈ క్షేత్రానికి వెళ్లేందుకు ఆటోలతో పాటు ఆర్టీసీ బస్సులు కూడా అందుబాటులో వుంటాయి.



యాగంటి క్షేత్రం : రాష్ట్రంలోని శైవ పుణ్యక్షేత్రాల్లో యాగంటి ప్రసిద్ధిగాంచింది. ఈ క్షేత్రంలోని ప్రధాన ఆలయంలో ఉమామహేశ్వర స్వామి, అమ్మవార్లు లింగంలో కొలువైవున్నారు. శివపార్వతులు ఇద్దరూ లింగంలో దర్శనమివ్వడం ఇక్కడ విశేషం. ఈ క్షేత్రంలో యాగంటి బసవన్న స్వయంభువుగా వెలసినట్లు భక్తుల నమ్మకం. ఈ నంది విగ్రహం రానురాను పెరుగుతూ ఆలయ ప్రాంగణాన్ని ఆక్రమిస్తోంది. ఈ క్షేత్రంలో ప్రకృతి ఒడిలో పట్టిన జలధార పర్వతసానుల్లో ప్రవహించి కోనేరులోకి చేరుతుంది. ఈ కోనేరును అగస్త్య పుష్కరిణిగా పిలుస్తారు. ఈ క్షేత్రానికి వెళ్లాలంటే నంద్యాల నుంచి రోడ్డుమార్గంలో 48కిమీలు బనగానపల్లెకు చేరుకుని అక్కడి నుంచి 11కిమీలు ప్రయాణిస్తే యాగంటికి చేరుకోవచ్చు.



నేడు జ్వాలాతోరణం

- కార్తీక పౌర్ణమికి ప్రత్యేక పూజలు
- అధిక సంఖ్యలో తరలిరానున్న భక్తులు

శ్రీశైలం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా జ్వాలా తోరణోత్సవాన్ని నిర్వహిస్తారు. ఆలయ ప్రధాన వీధిలోని గంగాధర మండపం వద్ద బుధవారం సాయంత్రం జరిగే కార్యక్రమాన్ని వీక్షించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్నారు. మంగళవారం ఈవో శ్రీనివాసరావు ఆలయ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈవో మాట్లాడుతూ కార్తీక పౌర్ణమికి సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. జ్వాలాతోరణం జరిగే ప్రాంతంలో తోపులాట, తొక్కి సలాట జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ వీక్షించేలా ప్రధాన కూడళ్లలో ఎల్ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటుచేయాలని ఆదేశించారు. నదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తారని, స్నానఘాట్‌ల వద్ద ప్రత్యేక భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. ఆలయ పుష్కరిణి వద్ద జరిగే లక్షదీపోత్సవం, పుష్కరిణి హారతి కార్యక్రమాల్లో భక్తులు పాల్గొనేందుకు వీలుగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు.



కార్తీక పౌర్ణమి ఏర్పాట్లపై అధికారులతో ఈవో సమావేశం

నవ నందుల దర్శనం.. పుణ్యప్రదం

- నవనంది క్షేత్రాల్లో ఆధ్యాత్మిక శోభ
- కార్తీక మాసంలో పోటెత్తుతున్న భక్తులు
- సాక్షి మల్లికార్జునస్వామి దర్శనంతోనే నవనందుల యాత్ర

నంద్యాల కల్చరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో నవ నందుల దర్శనం పుణ్యప్రదమైంది. కార్తీకం ప్రారంభం నుంచి పూర్తయ్యే దాకా విశిష్ట దైవారాధనలతో విభిన్న ఆచార సాంప్రదాయాలతో, దీక్షలతో కొనసాగుతుంది. రాయలసీమ ప్రాంతంలోని మహానంది క్షేత్రం చుట్టూ నంద్యాల వరకు ఉండే నవ నందుల ఆలయాలకు భక్తులు ఈ పోటెత్తారు. ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

నవనందుల దర్శనమిలా..

నవనందులను దర్శించుకోవాలంటే ముందుగా నంద్యాలలోని సాక్షి మల్లికార్జునస్వామిని దర్శించుకొని, ఇక్కడ నందీశ్వరుని చెవిలో భక్తులు తమ కోరికలను చెప్పి నవనందుల యాత్ర ప్రారంభించాలి. ముగింపు కూడా ఇక్కడే స్వామిని దర్శించుకొని చేయాల్సి ఉంది.




నవనందుల దర్శనం రూట్ మ్యాప్

ప్రథమ నంది..




నవనందుల్లో మొదటిది ప్రథమ నందీశ్వరాలయం. నంద్యాలలోని చామకాలువ గట్టున ఆలయం ఉంది. గర్భాలయంలో కేదారేశ్వర లింగం భక్తులకు దర్శనమిస్తుంది. ఇక్కడే మరోపక్క కేదారేశ్వరీ మాత కొలువుదీరి ఉంది. ప్రథమనందిలోని స్వామివారిని దర్శించుకొని అక్కడ ఉన్న నందీశ్వరుడుని దర్శించుకోవాలి.

నాగనంది..



వ్యాసరాయల కాలంలో నంద్యాల బస్టాండు సమీపంలోని స్వయంభూ ఆంజనేయస్వామి ఆలయంలో కుందూ నదిలో నుంచి నాగనంది తీసుకొని వచ్చి అక్కడ ప్రతిష్ఠించినట్లు శాసనాలు చెబుతున్నాయి. ఆ ఆలయంలో భారీ ఆకారంలో ఉన్న ఆంజనేయస్వామి మూలవిరాట్ కు ఎడమ వైపున నాగనందీశ్వరుడు కొలువు దీరాడు.

సోమనంది..



నంద్యాల కోట వీధిలో ఆత్మకూరు బస్టాండు సమీపంలో ఉన్న ఆలయం సోమనందీశ్వరాలయం. చంద్రుడు ఇక్కడ మహేశ్వరలింగాన్ని ప్రతిష్ఠించడంతో ఈ లింగానికి సోమనందీశ్వరుడు అని పేరువచ్చింది. క్షేత్ర ప్రాశస్త్యం రీత్యా సోమ నందీశ్వరుడు ఆరోగ్యప్రదాత అని భక్తుల నమ్మకం.

శివనంది..



అతిపురాతన మైన శివనంది క్షేత్రం. శివనంది బండి ఆత్మకూరు మండలం కడమల కాల్వలో ఉంది. ప్రశాంతవాతావరణం, పచ్చని, ప్రకృతి దృశ్యాలు ఆభరణాలుగా అలరారుతున్న ఈ ఆలయ శోభ అనన్య సామాన్యం. ఆలయం చుట్టూ 108 శివలింగాలు ఉన్నట్లు చరిత్ర చెబుతోంది. ఇక్కడ ప్రత్యేకత ఏమిటంటే శివలింగానికి బ్రహ్మసూత్రం వుంటుంది. పురాణంలో రెండో కాళహస్తిగా పేరు పొందింది.

భళా.. భైరవ క్షేత్రం



చింతల చెరువు భైరవగుండాల క్షేత్రం ఏరియల్ వ్యూ

చాగలమర్రి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నల్లమల ప్రకృతి సోయగాల నడుమ వెలసిన భైరవగుండాలు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. శ్రీకృష్ణదేవరాయల కాలం నాటి భైరవేశ్వర ఆలయం ఇక్కడ ఉంది. రాచరికపు గుర్తులు ఉన్న అతిపురాతన ఆలయం ఇది. పక్కన తెలుగుగంగ జలాశయం, నల్లమల కొండలు పర్యాటకులను ఆకర్షిస్తోంది. నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం చింతలచెరువు గ్రామ సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో 3 కి.మీ దూరంలో శ్రీకృష్ణదేవరాయల కాలంలో భైరవేశ్వర ఆలయం నిర్మించారు. ఇక్కడ ఈశ్వరుడు, భైరవీశ్వరుడు, పలు దేవతామూర్తులు కొలువుదీరారు. కృష్ణానది ఒడ్డున ఈశ్వర ఆలయం ఉండటం ఇక్కడి ప్రత్యేకత. శివాలయం పక్కన అమ్మవారు, సీతారాముల ఆలయాలు, అక్కదేవతలు, ఆంజనేయస్వామి గుడి కొలువై ఉన్నాయి. కాశీరెడ్డినాయన భైరవగుండాలను సందర్శించడం వల్ల గ్రామస్థులు కాశీరెడ్డినాయన గుడిని కూడా ఏర్పాటు చేశారు. ఈ ఆలయాన్ని ప్రతాప రుద్రుడు సందర్శించినట్లు గ్రామ పెద్దలు చెబుతున్నారు. కార్తీకమాసం, మహాశివరాత్రి ఉత్సవాలు ప్రతి ఏడాది అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. 5న బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక ఉత్సవాలు నిర్వహించేందుకు కమిటీ సభ్యులు భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. 2008 మంది మహిళలచే అఖండ దీపోత్సవం, శివపార్వతుల కల్యాణోత్సవం, గణపతి, చండీ, పూర్ణాహుతి హోమాలు వేద పండితుల ఆధ్వర్యంలో జరిగేలా ఏర్పాట్లు చేశారు. కళాకారులచే సాంస్కృతిక, భజన కార్యక్రమాలు జరుగుతాయి. భక్తులకు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. కార్తీకపౌర్ణమి ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆలయ అధ్యక్షుడు మునయ్యస్వామి, కమిటీ సభ్యులు కోరారు.

సూర్యనంది దేవాలయం...



నంద్యాలకు 8 కిలోమీటర్ల దూరంలోని నందిపల్లెలో వెలసిన సూర్యనంది క్షేత్రం. సూర్యుడు ఇక్కడ శివుడి గురించి తపస్సు చేసి ఆస్వామి లింగాన్ని ప్రతిష్ఠించాడు. నవనందుల యాత్ర చివరిగా సూర్యనంది దేవాలయంతో పూర్తి అయుంది. ఈ నవనందులను దర్శనం చేసుకుంటే కాశీకి పోయినంత పుణ్యఫలం వస్తుందన్నారు.

వినాయక నంది..



మహానందీశ్వరాలయానికి ఈశాన్య దిశలో పరమేశ్వర లింగాన్ని సాక్షాత్తు వినాయకుడు ప్రతిష్ఠించినట్లు చెబుతారు. నాగఫణి చత్రంగా ఇక్కడ స్వామివారు అలరారుతున్నారు.

నేడు మహానందిలో కోటి దీపోత్సవం

మహానంది, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో బుధవారం కోటి దీపోత్సవం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. కార్తీకమాసం పౌర్ణమి పురస్కరించుకుని ఆలయంలో అర్చకులు విశేష పూజలు నిర్వహిస్తారు. సాయంత్రం 6 గంటలకు మేళతాళాలతో ఉత్సవమూర్తులను కళా వేదిక మంటపం వద్దకు తీసుకుని వస్తారు. ఆలయం ప్రధాన రాజగోపురం వద్ద ఏర్పాటు చేసిన జ్వాలాతోరణాన్ని భక్తి శ్రద్ధలతో వెలిగిస్తారు. వేలాదిమంది భక్తుల సమక్షంలో ఆలయం పరిసరాల్లో రాత్రి 7 గంటల నుండి కోటి దీపోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. కాగా కోటి దీపోత్సవం కార్యక్రమ ఏర్పాట్లను మంగళవారం నంద్యాల రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ రామ్మోహన్ రెడ్డి, ఆలయ అధికారులు పరిశీలించారు.



కోటి దీపోత్సవం(ఫైల్)

విష్ణునంది..




శివనందీశ్వరాలయానికి మూడు కిలోమీటర్ల దూరంలో నల్లమల అడవుల మధ్యలో ఉన్న ఈ ఆలయ శోభ వర్ణనాతీతం. ఈ ఆలయానికి చేరుకున్న భక్తులు ఇక్కడ ప్రకృతిమాత ఒడిలో మైమరిచిపోతారు. సాక్షాత్తు శ్రీమహావిష్ణువుచే ప్రతిష్ఠించిన లింగం కాబట్టి విష్ణునందీశ్వర క్షేత్రం అని పేరు వచ్చింది. గర్భాలయంలో విష్ణునందీశ్వరుడు లింగరూపంలో దర్శనమిస్తాడు.

మహానంది...



నందీశ్వరుడు జన్మించిన క్షేత్రమే మహానంది అని భక్తుల నమ్మకం. ఇక్కడి గంగతో సమానమైన తీర్థం వేరొకటి లేదని, ఈశ్వరుడికి అభిషేకం, ఉసరిక దీపం, చేయడం ఈ క్షేత్రంలోని సంప్రదాయాలు. నందీతీర్థం అనేది ఇక్కడి ప్రత్యేక ఆకర్షణ.

గరుడ నందీశ్వరుడు...



మహానంది దివ్యక్షేత్రం నడిబొడ్డున గరుడ నందీశ్వరుడు కొలువుదీరాడు. ఈ గరుడ నందీశ్వరాలయం అతి పురాతనమైనది. గరుత్మంతుడు ఇక్కడ మహాదేవుని గురించి తపస్సు చేసి ఇక్కడ భవ్య లింగాన్ని ప్రతిష్ఠించినట్లు పురాణాల ద్వారా మనకు అవగతమవుతోంది.

డిగ్రీ విద్యార్థి ఆత్మహత్యాయత్నం

కర్నూలు క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కప్పల్‌నగర్‌కు చెందిన ఓ డిగ్రీ విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కొద్ది కాలంగా ఓ యువతితో ప్రేమాయణం సాగించాడు. ఆ యువతికి సంబంధించిన బంగారు నగలను తీసుకుని తాకట్టు పెట్టి తర్వాత విడిపించలేదు. విషయం యువతి తండ్రికి తెలియడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఇరు వర్గాలను పిలిపించి సమస్య పరిష్కరించే విదంగా చర్చించారు. అయితే ఆ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఓ ఆసుపత్రిలో కోలుకుంటున్నాడు. పోలీసులు కేసు విచారిస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య

కర్నూలు క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీనివాసనగర్‌కు చెందిన జానీ(16) ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల మేరకు.. జానీ 8వ తరగతి వరకు చదివి మానేశాడు. చెడు అలవాట్లకు లోనై చిన్న చిన్న దొంగతనాలు చేస్తూ జల్సా చేసేవాడు. తండ్రి చిన్నరాముడు ప్రవర్తన మార్చుకోవాలని పలుమార్లు చెప్పినా మార్పు రాలేదు. కాగా మరోసారి ఇంట్లోని బీరువాలో దొంగతనం చేసేందుకు ప్రయత్నించగా తండ్రి తీవ్రంగా మందలించాడు. దీంతో తాను పని చేసే గౌండా గౌస్ కొట్టం వద్దకు వెళ్లి ఉరి వేసుకున్నాడు. గౌండా గౌస్ గుర్తించి తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. తండ్రి చిన్నరాముడు, బంధువులు చేరకుని హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తన కొడుకు మృతిపై అనుమానం ఉందని తండ్రి చిన్నరాముడు పోలీసులకు పిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

కొలిమిగుండ్ల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హనుమంతుగుండం గ్రామంలో దారా రమేష్(30) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మంగళవారం జరిగింది. ఇంట్లో ఎవ్వరూలేని సమయంలో రమేష్ పురుగుల మందు తాగుతుండగా గమనించిన కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. తల్లి రాజమ్మ పిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కొలిమిగుండ్ల సీఐ మద్దినేని రమేష్‌బాబు తెలిపారు.

దీపం వెలిగిస్తూ బాలిక..

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి మండలం నరసాపురం గ్రామం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మూడో తరగతి విద్యార్థి రేవతి కార్తీక దీపం వెలిగిస్తూ నిప్పంటుకుని మృతిచెందినట్లు డీఈవో శామ్యూల్ తెలిపారు. ఆంజనేయస్వామి గుడిలో కార్తిక మాసం సందర్భంగా దీపం వెలిగిస్తుండగా బాలిక దుస్తులకు నిప్పంటుకుంది. అయితే ఈ ప్రమాదం పాఠశాలలో చోటుచేసుకోలేదని డీఈవో కలెక్టర్‌కు తెలియజేశారు.

సాక్షి యాజమాన్యంపై కేసు నమోదు

కర్నూలు క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయ రెడ్డి, రిపోర్టర్ ప్రతాప్‌పై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ పార్థసారధి తెలిపారు. వివరాల మేరకు.. గత నెల 30న తన పరువుకు భంగం కలిగించేలా వార్తలు ప్రచురించారని, రంగరాజు వీధికి చెందిన సందీప్ అనే వ్యక్తి పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేశాడు. ముక్కు, మొహం తెలియని వ్యక్తులు కాంట్రాక్టర్ లైసెన్సు లేని వారు కార్పొరేషన్‌లో పెత్తనం చెలాయిస్తున్నారనే ఆరోపణలతో పరోక్షంగా పార్టీ నాయకులు, మంత్రి టీజీ భరత్‌పై నిందలు వేయడంతో పిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

సెల్‌ఫోన్ దొంగ అరెస్టు



దొంగను చూపుతున్న రైల్వే ఎస్ఐ కుమారి

నంద్యాల టౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): నంద్యాల రైల్వేస్టేషన్‌లో సెల్‌ఫోన్ దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని మంగళవారం అరెస్టు చేసినట్లు జీఆర్పీ ఎస్ఐ కుమారి తెలిపారు. వివరాలు.. సోమవారం రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫారం 1 వద్ద ఓ వ్యక్తి గుంటూరు-కాచిగూడ రైలు ఎక్కే సమయంలో ఫోన్లు చోరీ చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడు హుల్లప్పను రైల్వేస్టేషన్ నూతన ఫుట్ ఓవర్ బ్రిడ్జి వద్ద పట్టుకున్నాం. అతడి వద్ద నుంచి రూ.1.20లక్షల విలువ చేసే నాలుగు ఫోన్లను స్వాధీనం చేసుకుని అరెస్టుచేసి రిమాండుకు తరలించామన్నారు. దొంగను పట్టుకున్న హెడ్ కానిస్టేబుల్ ఖలీల్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

6న వ్యాస రచన, వక్తృత్వ పోటీలు

కర్నూలు ఎడ్యుకేషన్/ కలెక్టరేట్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): భారతరత్న డా. మౌలానా అబ్దుల్ కలాం అజాద్ జయంతి, మైనార్టీ సంక్షేమ దినోత్సవం పురస్కరించుకుని జిల్లా స్థాయిలో అబ్దుల్ కలాం ఆజాద్ జీవిత చరిత్రపై హైస్కూల్, ఇంటర్, డిగ్రీ, పీజీ స్థాయి విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు తెలుగు, ఇంగ్లీషు, ఉర్దూ భాషల్లో నిర్వహిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి సయ్యద్ షమీనా పర్వీన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6వ తేదీన ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కర్నూలు గడియారం ఆసుపత్రి వద్ద ఉన్న ప్రభుత్వ మైనార్టీ జూనియర్ కళాశాలలో పోటీలు నిర్వహిస్తారన్నారు. ఆసక్తిగల విద్యార్థులు డా. షంషుద్దీన్ సెల్. నెంబర్.9441761026 ను సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఈ పోటీల్లో విజేతలకు కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందజేస్తారని అన్నారు.

యాగంటి వెతలు

- నిధులున్నా అభివృద్ధి చెందని క్షేత్రం
- ఏ పని చేపట్టాలన్నా ఆర్కియాలజీ శాఖ అడ్డంకులు
- వసతులు లేక భక్తుల ఇక్కట్లు



ఆలయం చుట్టూ ఉన్న కొండలు

బనగానపల్లె, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవ క్షేత్రం యాగంటి అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. నిధులు ఉన్నా వాటిని ఖర్చు చేయని దుస్థితిలో దేవదాయశాఖ ఉంది. ఏ అభివృద్ధి పనులు చేపట్టాలన్నా ఆర్కియాలజీ శాఖ అధికారులు అడ్డుపడుతున్నారు. దీంతో కనీస వసతులు లేక భక్తులు ఇక్కట్లు పడుతున్నారు.

పురాతన యాగంటి క్షేత్రానికి జిల్లా నుంచే కాక ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి అధికసంఖ్యలో భక్తులు వస్తుంటారు. ఆలయానికి భక్తుల ద్వారా సంవత్సరానికి రూ.కోటి వరకు ఆదాయం వస్తోంది. ప్రతి మూడు నెలలకోసారి స్వామి వారి హుండీని లెక్కిస్తుంటారు. ఇంత డబ్బు ఉన్నా.. క్షేత్రంలో ఏ అభివృద్ధి పని చేపట్టాలన్నా ఆర్కియాలజీ శాఖాధికారులు అడ్డుపడుతుంటారు. దీంతో ఆలయాధికారులు ఏమీ చేయలేకపోతున్నారు. భక్తులు రాత్రి వేళల్లో బస చేయడానికి కూడా దేవదాయ స్థలం లేదు. ఉన్న యాగంటి ఆలయ స్థలాన్ని కొందరు ఆక్రమించుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆలయ సమీపంలో టూరిజం శాఖకు చెందిన 8 గదుల కాటేజీ మాత్రమే ఉంది. బ్రాహ్మిణి రెసిడెన్సీ మాత్రమే ఉన్నాయి. ఇందులో అద్దెలు ఎక్కువగా ఉన్నందు వల్ల భక్తులు స్వామి వారి దర్శనం చేసుకొని వెంటనే వెళ్లిపోతున్నారు.

కొండలను తొలిచి అభివృద్ధి చేయాలి

గత పాలక వర్గం సభ్యులు ఆలయం ఎదురుగా ఉన్న కొండలను కొంతమేరకు తొలచి విశాలమైన రోడ్లు వేయించారు. ఇట్లాగే మరింతగా కొండలు తొలచి చదును చేసి భక్తుల కోసం భవన నిర్మాణ పనులు చేపట్టాలని కోరుతున్నారు. ఆలయం చుట్టూ ఉన్న భూములను యజమానుల నుంచి కొని భక్తులకు వసతి గదులు నిర్మించి ఉంటే ఇబ్బందులు ఉండేవి కాదని భక్తులు అంటున్నారు. నిధులు ఉన్నా, దాతలు ముందుకు వస్తున్నా సొంత స్థలం లేకపోవడంతో క్షేత్రం అభివృద్ధి కావడం లేదు. ఆలయాభివృద్ధికి ఏచిన్న పని చేపట్టినా చేయాలన్నా ఆర్కియాలజీ అధికారులు దేవదాయ శాఖాధికారులకు నోటీసులు జారీ చేస్తున్నారు.

అనుమతులు ఇవ్వడం లేదు

ఆలయం ఆర్కియాలజీ శాఖ పరిధిలో ఉండడంతో క్షేత్రంలో ఏ అభివృద్ధి పని చేయాలన్నా ఆర్కియాలజీ అధికారులు అడ్డుపడుతున్నారు. చివరికి ఆలయ కార్యనిర్వహణ అధికారి గది నిర్మించుకోవడానికి కూడా అనుమతి ఇవ్వడం లేదు. దీంతో ఈవో, సిబ్బంది ఆర్కియాలజీ శాఖ గదిలో విధులు నిర్వహిస్తున్నారు. దేవదాయ శాఖకు సొంత స్థలాలు లేకపోవడంతో ఆలయ పరిసర ప్రాంతాల్లో కనీసం భక్తులకు వసతులు కల్పించుకోలేకపోతున్నారు. ఉన్న కొంత స్థలాన్ని ఆక్రమించుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆలయం చుట్టూ కొండలు ఉండడంతో భక్తులకు వసతి కల్పించలేకపోతున్నారు. ఆర్కియాలజీ శాఖ పరిధి నుంచి దేవదాయ శాఖ పరిధిలోకి ఈ ఆలయాన్ని చేరిస్తే అభివృద్ధి చెందుతుందని భక్తులు పేర్కొంటున్నారు.



యాగంటి క్షేత్రం రాజగోపురం

విద్యుత్ బిల్లు చూస్తేనే షాక్

- రైస్ మిల్లు ప్రారంభం కాక ముందే బిల్లు
- ఖంగుతిన్న యజమాని

నందికొట్కూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైస్ మిల్లు ప్రారంభం కాక ముందే విద్యుత్ బిల్లు మోత మోగింది. రూ.57,323 కరెంటు బిల్లు వచ్చింది. ఇదేమిటి రైస్‌మిల్లు ప్రారంభం కాకముందే ఇంత విద్యుత్ బిల్లు రావడంతో యజమాని ఒక్కసారిగా ఖంగుతిన్నాడు. వివరాలు.. మండలంలోని బిజినవేముల వద్ద ముబారక్ మొదీర్న్ యు.ఎస్.సీ నెం: 8532212001306 కు రూ.57,323 బిల్లు గత శనివారం వచ్చింది. బిల్లు చూసిన యజమాని అబ్దుల్ హమీద్ ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. గత నెలలో రైస్ మిల్ మరమ్మతు పనులు చేస్తేనే రూ.21,771 వచ్చింది. ఈ నెలలో ఎలాంటి పనులు చేయలేదని, ఇంకా రైస్‌మిల్లు కూడా ప్రారంభం కాకముందే ఇంత విద్యుత్ బిల్లు రావడంతో ఏమిటో అర్థం కావడం లేదని వాపోతున్నారు. ఇలా విద్యుత్ బిల్లులు వస్తే రైస్ మిల్లు నిర్వహించే కన్నా ఏపీఎస్పీడీసీఎల్ వారిసే రాసి ఇవ్వాల్సి వస్తోందని అన్నారు. ఈవిషయంపై విద్యుత్ ఏ.ఈ. రాములునాయక్‌ను వివరణ కోరగా రైస్ మిల్ యజమాని మాకు ఫిర్యాదు చేశారు. వర్షం కారణంగా ఈ రోజు వెరిఫికేషన్‌కు వెళ్లలేదు. కొత్త రైస్‌మిల్ కావడంతో విద్యుత్ కెపాసిటర్లు కం టిన్యూగా ఆన్‌లోనే ఉంచడంతో రీడింగ్ పెరిగి ఉంటుందన్నారు. బుధవారం రైస్‌మి ల్లును తనిఖీచేసి మీటరు రీటింగ్‌ను పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.



బిల్లు చూపుతున్న మిల్లు యజమాని

గాలిమరల భూముల పరిశీలన

బేతంచెర్ల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరు గ్రామాల్లో గాలి మరలకు (ఈసీవో ఆర్‌ఈఎన్) కేటాయించిన భూములను జేసీ కార్తీక్, డోన్ ఆర్డీవో నరసింహులు, బేతంచెర్ల తహసీల్దార్ నాగమణి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలోని కొలుముల పల్లె, గూటుపల్లి, ఆర్ఎస్ రంగాపురం, బేతంచెర్ల, ముద్దవరం గ్రామాల్లోని భూములను చూశారు. ఈ సందర్భంగా జేసీ ప్రాజెక్టు అమలు సర్వే, భూ సంబంధిత అంశాలు, స్థల సరిహద్దులు, గ్రామాల్లో జరుగుతున్న పనులకు ప్రత్యక్షంగా పరిశీలించారు. గ్రామ ప్రజలకు ప్రాజెక్టు ప్రయోజనాలను వివరించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.



తహసీల్దార్‌తో కలిసి రికార్డులను పరిశీలిస్తున్న జేసీ కార్తీక్



ఇళ్ల మధ్యలో కొండచిలువ



శ్రీశైలం నవంబర్ 4 (ఆంధ్రజ్యోతి): పదిహేను అడుగుల కొండచిలువ ఇళ్ల మధ్యలోకి రావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. శ్రీశైల మండలంలోని సున్నిపెంట గ్రామంలో వెస్టర్న్ కాలనీ సత్యనారాయణస్వామి దేవాలయం సమీపంలో గల ఇళ్ల మధ్యలోకి పొడవైన కొండచిలువ వచ్చింది. అటుగా వెళ్తున్న కొందరు గమనించి ఇళ్లలో ఉండేవారిని అప్రమత్తం చెసి అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు స్పందించడంతో, స్నేక్ క్యాచర్ కొండచిలువను పట్టుకుని అటవీ ప్రాంతో విడిచిపెట్టాడు.

జీజీహెచ్‌లో అరుదైన శస్త్రచికిత్స

నంద్యాల హాస్పిటల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో అరుదైన శస్త్రచికిత్స చేసి రోగికి ఉపశమనం కలిగించారు. జీజీహెచ్ న్యూరోసర్జరీ డాక్టర్లు రాజేష్, భరత్ ఆస్పత్రి పరికరాలతో పాటు తమ సొంత పరికరాలతో జీజీహెచ్‌లో శస్త్ర చికిత్స చేయడం విశేషం. ఇసుకపల్లెకి చెందిన రాజు గత నెల 30వ తేదీన ఆస్పత్రిలో చేరాడు. 31న వెన్నెముకలో డిస్క్ భాగం పెరిగి ఉండటంతో ఎండోస్కోపి ద్వారా ఆపరేషన్ చేశారు. డిస్క్‌కు అదనంగా వచ్చిన భాగాన్ని తీసివేశారు. సూపరింటెండెంట్ డా.మల్లేశ్వరి మాట్లాడుతూ రక్తస్రావం లేకుండా బటన్‌హోల్ ద్వారా ఆపరేషన్ నిర్వహించిన వైద్యులను, సిబ్బందిని అభినందించారు. ఆపరేషన్‌కు అవసరమైన పరికరాలు సొంతంగా తెచ్చుకొని జీజీహెచ్‌లో సర్జరీ చేయడం శుభపరిణామం అన్నారు. ఇదే సర్జరీ ప్రైవేట్ ఆస్పత్రిలో దాదాపు రూ.5లక్షల వరకు ఖర్చవుతుందని అలాంటిది ఉచితంగా జీజీహెచ్‌లో చేశామన్నారు. సర్జరీ అనంతరం తనకు ఎలాంటి ఇబ్బందిలేదని రోగి రాజు తెలిపారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డా.జిలాని, ఆర్ఎంవో డా.వెంకటేష్, అనస్థీషియా హెచ్‌వోడీ డా.క్రిష్ట ఫర్, జీజీహెచ్ ఏడీ మస్తాన్, ఓటీ సిబ్బంది పాల్గొన్నారు.



రోగితో వైద్యులు

రాఘవేంద్రుని సన్నిధిలో కర్నూలు ఎస్పీ

మంత్రాలయం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కర్నూల్ ఎస్పీ విక్రాంత్ పాటిల్ మంగళవారం మంత్రాలయంకు వచ్చారు. మహా ముఖద్వారం వద్ద మఠం జోనల్ మేనేజర్ శ్రీపతిఆచార్ ఘనంగా స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. మఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు జ్ఞాపిక, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, సురేష్ కోనాపూర్, మంత్రాలయం సీఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్, వ్యాసరాజాచార్, రంగస్వామి, రామకృష్ణ, వీరేష్, నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.



ప్రదక్షిణ చేస్తున్న ఎస్పీ

కర్నూలు కీర్తి ప్రతిష్టలు

పెంపొందించేలా కళా ప్రదర్శనలు

- నాలుగో రోజు అలరించిన కళ, సాహిత్య ప్రదర్శనలు
- ఘనంగా 'కర్నూలు ఉత్సవ్-2025'



సాహితీవేత్తలను సత్కరిస్తున్న కళాక్షేత్రం కమిటీ సభ్యులు, ముఖ్య అతిథులు

కర్నూలు కల్చరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా కీర్తి ప్రతిష్టను పెంపొందించేలా కర్నూలు ఉత్సవ్-2025 ప్రదర్శనలు కొనసాగుతున్నాయని పలువురు వక్తలు కొనియాడారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర అవతరణ ఉత్సవాలు వారం రోజుల పాటు నిర్వహించడం అభినందనీయమన్నారు. నగరంలోని టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కర్నూలు ఉత్సవ్-2025 ప్రదర్శనలు మంగళవారం నాలుగో రోజుకు సందడిగా సాగాయి. సాయంత్రం ఏర్పాటు చేసిన సభకు ముఖ్య అతిథులుగా రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య, నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ సతీష్‌రెడ్డి, వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి హాజరై తెలుగుతల్లి, పొట్టి శ్రీరాములు చిత్ర పటాలకు పూలదండలు వేసి నివాళులర్పించారు. అంతకు ముందు కళాక్షేత్రంలో ఆవరణలో ఏర్పాటు చేసిన జిల్లా ప్రముఖుల ఛాయాచిత్ర ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా సభలో వక్తలు మాట్లాడుతూ జిల్లా జానపద కళలకు, సాహిత్యానికి, నాటక రంగానికి ఈ సభలు గుర్తింపు తెచ్చాయన్నారు. కనుమరుగవుతున్న తోలుబొమ్మలాట, చెక్కభజన వంటి అపురూప కళారూపాలను తెరమీదికి తీసుకువచ్చి, వారితో ప్రదర్శనలు ఇప్పించడం స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందని అన్నారు. అనేక కళారూపాలు ఆదరణ లేక తెరచాటుకు తప్పుకుంటున్నాయని, టీజీవీ కళాక్షేత్రం వారి ఉనికిని గుర్తించి వెలుగులోకి తీసుకురావాలని సూచించారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు కళారత్న పత్తి ఓబులయ్య మాట్లాడుతూ టీజీవీ కళాక్షేత్రం నిత్యం కల్యాణం పచ్చతోరణంగా కళలు, కళారూపాలతో నిండుగా కనిపించాలనేది క్షేత్రం గౌరవ చైర్మన్, మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ ఆకాంక్ష అన్నారు. ఈ కార్యక్రమంలో కళాక్షేత్రం ప్రతినిధులు సి.యాగంటీశ్వరప్ప, సీవీ రెడ్డి, లక్ష్మీకాంతరావు, పీపీ గురుమూర్తి, వాల్మీకి రాముడు, గాండ్ల లక్ష్మన్న, సంగా ఆంజనేయులు, కేవీ రమణ, జీవీ శ్రీనివాసరెడ్డి, మహ్మద్ మియా, పి.రాజారత్నం, ఇనాయతుల్లా, కె.బాలవెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న జానపద కళారూపాలు..

జానపద కళలకు పట్టం కడుతూ నాలుగో రోజు వేడుకలు కొనసాగాయి. ఉదయం పది నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఏకాంకిక పౌరాణిక పద్య నాటక నాటక పోటీలు కొనసాగాయి. నేటి తరానికి తెలియని తోలుబొమ్మలాట ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రాజేశ్వరమ్మ బృందం, కుళ్లాయమ్మ బృందం సభ్యులు ఈ ప్రదర్శనలు చేశారు. నంద్యాల జిల్లా గాజులపల్లెకు చెందిన వై.గంగాధర్ బృందం చెక్కభజన ఉత్సాహాన్ని నింపింది. ఏకాంకిక నాటక ప్రదర్శనల్లో దేవనకొండకు చెందిన బృందం శ్రీకృష్ణ రాయబారం, డోన్ బృందం రామాంజనేయ యుద్ధం, బి.తాండ్రపాడు బృందం శ్రీకృష్ణ తులాభారం, దేవనకొండ బృందం గయోపాఖ్యానం, ఇతర ప్రాంతాల కళాకారుల సత్యహరిశ్చంద్ర, బాలనాగమ్మ ప్రదర్శనలు ప్రేక్షకులను కట్టిపడేశాయి. తేజ బృందం శాస్త్రీయ నృత్యాలు ఆకట్టుకున్నాయి.



శ్రీకృష్ణ రాయబారంలోని ఓ సన్నివేశం

సాహితీ ప్రముఖులకు సత్కారం

ఉమ్మడి జిల్లాలో సాహిత్య సేవలు అందిస్తున్న పలువురు సాహితీ ప్రముఖులను ఈ సభలో ఘనంగా సత్కరించారు. ఎస్‌డీవీ అజీజ్, గూడూరు మునిస్వామి, డాక్టర్ కర్నాటి చంద్రమౌళిని, డాక్టర్ ఎం.హరికిషన్, కెంగార మోహన్, గౌరెడ్డి హరిశ్చంద్రారెడ్డి, నవప్పగారి ఈరన్న, రంగనాథ రామచంద్రరావు, గెలివి సహదేవుడు, ఆరేపల్లి వరలక్ష్మమ్మలకు ముఖ్య అతిథులకు సన్మానాలు నిర్వహించారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

సొసైటీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

ఆత్మకూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సహకార పరపతి సంఘాలు, బ్యాంకుల ద్వారా అందించే రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆత్మకూరు సింగిల్ విండో చైర్మన్ షహబుద్దీన్ కోరారు. మంగళవారం సొసైటీ కార్యాలయంలో నాబార్డు, ఎస్‌బిఎఫ్ ఆధ్వర్యంలో ఆర్థిక, సాంకేతిక అక్షరాస్యతపై రైతులకు అవగాహన కల్పించారు. సమావేశంలో టీడీపీ మండల, పట్టణాధ్యక్షులు రవీంద్రబాబు, వేణుగోపాల్, నాయకులు మల్లికార్జునరెడ్డి, రాజారెడ్డి, కలిముల్లా, సొసైటీ సీఈవో నాగేశ్వరరావు, డైరెక్టర్లు ప్రవీణ్, రమేష్, సహకార బ్యాంకు మేనేజర్ ఎస్ఎం.రసూల్ తదితరులున్నారు.

పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

పాణ్యం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆలయాల్లో భక్తులకు పకడ్బందీగా రక్షణ ఏర్పాట్లు చేయాలని ఏఎస్పీ జావళి అల్ఫోన్స్ ఆదేశించారు. మంగళవారం మండలంలోని కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో సందర్శించారు. ఈవో రామకృష్ణ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు సురేష్‌శర్మ ఆధ్వర్యంలో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా భక్తుల సౌకర్యాలను పరిశీలించారు. ఆలయంలో జరిగే వడిబియ్యం కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ కిరణ్ కుమార్‌రెడ్డి, ఆలయసిబ్బంది సుబ్బారెడ్డి, నాగేశ్వరరావు, గ్రామ పెద్దలు మిలిటరీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం చేయాలి

● కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని అవలంబించి తమ పంటకు తామే ధర నిర్ణయించే స్థాయికి ఎదగాలని కలెక్టర్ రాజకుమారి సూచించారు. మంగళవారం పట్టణంలోని క్రాంతినగర్‌లో డీపీఎంయూ ఆధ్వర్యంలో జరుగుతున్న టీ-ఐసీఆర్‌పీ ఐదు రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో లక్ష ఎకరాల్లో వ్యవసాయం విస్తరింపజేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం, వ్యవసాయ శాఖలు సమన్వయంతో ముందుకు సాగుతున్నాయన్నారు. ప్రకృతి వ్యవసాయం విస్తరణలో మహిళా సంఘాల పాత్ర అత్యంత కీలకమన్నారు. ప్రతి టీ-ఐసీఆర్‌పీ ఒక ఆదర్శ రైతుగా ఎదిగి ఇతరులను ప్రకృ తి వ్యవసాయం వైపు మార్చేలా ప్రేరేపించాలన్నారు. పొలాల గట్లపై మొక్కలను నాటి పర్యావరణ సమతౌల్యం కాపాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి ఎంసీ మద్దిలేటి, డీపీఎం శ్రీనివాసులు, ఏడీపీఎం అబ్దుల్ సలాం, జిల్లా ఎన్ఎఫ్ఏలు, డీటీటీలు, టీ-ఐసీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

కష్టపడితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చు

నంద్యాల నూనెపల్లి : కష్టపడే మనస్తత్వం ఉంటే ఉన్నత శిఖరాలను చేరుకోవడం సులభమని కలెక్టర్ రాజకుమారి అన్నారు. మంగళవారం పట్టణంలోని రైతునగర్ సమీపంలోని ఫంక్షన్ హాలులో ఇంటర్‌రైజ్ ఇన్‌స్పైర్ అవార్డ్-రాయలసీమ ఎక్స్‌ప్రెస్ వే ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యార్థుల అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పది, ఇంటర్మీడియట్ తర్వాత ఐఐటీ, నీట్ వంటి పోటీ పరీక్షల్లో ప్రతిభ చూపాలంటే విశ్లేషణాత్మకంగా చదవాలన్నారు. గత విద్యాసంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన 42 మందికి మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డీఈవో జనార్దన్‌రెడ్డి, రాయలసీమ ఎక్స్‌ప్రెస్ వే ప్రైవేట్ లిమిటెడ్ ప్రాజెక్టు డైరెక్టర్ మదన్ మోహన్ టోల్ ప్లాజా మేనేజర్ సుబ్రమణ్యం, ఎక్స్‌ప్రె స్ వే బృంద సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కురిసిన వర్షం

ఆత్మకూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మంగళవారం మధ్యాహ్నం వర్షం కురిసింది. ఉన్నట్లుండి ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై వర్షం కురిసింది. పట్టణంలోని కేజీరోడ్డు, తిక్కయ్యస్వామి దర్గా, అప్పారావువీధి తదితర ప్రధాన రహదారులపై వర్షపునీరు నిలిచింది. లోతట్టు కాలనీల్లో నీరు నిలిచిపోవడంతో జనం అసౌకర్యానికి లోనయ్యారు. తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో వర్షపునీరు నిలువడంతో జనం ఇబ్బందులు పడ్డారు. వర్షాలు వల్ల పంటకోతలు జరిపేందుకు వీల్లేక రైతులు అల్లాడిపోతున్నారు.


ఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో నిలిచిన వర్షపునీరు

నందికొట్కూరు: పట్టణంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలైన మారుతి నగర్, హాజీ నగర్‌లు జలమయమయ్యాయి. పట్టణానికి ఎగువన ఉన్న 340-సి నేషనల్ హైవే వద్ద నిలిచిన వర్షపు నీటిని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, కమిషనర్ బేబీ పరిశీలించారు. ఎగువ నుంచివస్తున్న వర్షపు నీటిని ఎలా మళ్లిస్తే పట్టణానికి వరద తగ్గుతుందన్న అంశాలపై అధికారులతో ఆయన చర్చించారు. వర్షం వచ్చిన ప్రతి సారి నాయకులు అధికారులు, నేషనల్ హైవే పైన, లోతట్టు ప్రాంతాల్లో పర్యటించడం తప్పా.... శాశ్వత పరిష్కారం చూపడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.


నందికొట్కూరులో వర్షపు నీటిని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్

పగిడ్యాల: మండలంలో మంగళవారం తెల్లవారుజాము నుంచి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. మొక్కజొన్న పొలాల్లో వర్షపు నీరు నిలిచింది. దాంతో పంటను నూర్పిడి చేసేందుకు ఇబ్బందిగా మారింది. మండలంలో రాత్రి 24.6 మి.మీ వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

యువకుడు అదృశ్యం - కేసు నమోదు

ఆత్మకూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గరీబ్‌నగర్‌కు చెందిన యువకుడు అదృశ్యమయ్యాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మంగళవారం అర్బన్ సీఐ రాము కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని కళాశాలలో ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ చదువున్న సంతోష్ సోమవారం ఉదయం 9గంటలకు కళాశాలకు వెళ్తున్నానని ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అయితే మంగళవారం రాత్రి వరకు ఇంటికి రాలేదు. దాంతో బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

రైతులను ఆదుకుంటాం

కొత్తపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ ప్రభావంతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో ఎంపీపీ కిచ్చెన్నగారి కుసుమలత అధ్యక్షతన డిప్యూటీ ఎంపీడీవో సుబ్బారావు ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం లోపిస్తే పంచాయతీ కార్యదర్శులే బాధ్యత వహించాలని హెచ్చరించారు. 15వ ఆర్థిక సంఘం నిధులు ఎక్కడ ఖర్చు చేశారో తెలపాలన్నారు. అనంతరం దుద్యాల సర్పంచ్ శోభలత, గువ్వలకుంట్ల ఎంపీటీసీ స్రవంతి, ముసలిమడుగు సర్పంచ్ జమీలాబీ పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. సమావేశంలో జడ్పీటీసీ సోముల సుధాకర్ రెడ్డి మత్స్య శాఖ అధికారి భరత్వాల్ నాయక్, తహసీల్దార్ ఉమారాణి, ఎంఈవో నాగరాజు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

టీడీపీలో చేరిక

మండలంలోని నందికుంట గ్రామంలో వైసీపీని వీడి దాదాపు 50 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారు. మంగళవారం స్థానిక టీడీపీ నాయకులు జహరుల్లా ఆధ్వర్యంలో టీడీపీ నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య సమక్షంలో ఆరుమంది వార్డు సభ్యులతో పాటు 50 కుటుంబాల వారు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కొత్తపల్లి, నందికొట్కూరు మండల కన్వీనర్లు లింగస్వామి గౌడు, మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, నారపురెడ్డి, వీరం ప్రసాద్ రెడ్డి, కడియం వెంకటేశ్వర్లు యాదవ్, నాగేశ్వర రావు యాదవ్, షమీవుల్లా ఉన్నారు.

ప్రతి కాలనీలో పైపులైన్ ఏర్పాటు చేయాలి

నందికొట్కూరు: గ్రామంలోని ప్రతి కాలనీలో మంచినీటి పైపులైన్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే గిత్త జయసూర్య ఆదేశించారు. మంగళవారం అల్లూరు గ్రామంలో జరుగుతున్న తాగునీటి నూతన పైపులైన్ పనులను టీడీపీ నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డితో కలిసి పరిశీలించారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ నాయకులు కురువ వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ శ్రీనివాసులు, ఏఈ వేణుమాధురి, గ్రామస్థులు ఉన్నారు.

మేదరుల ఉపాధి కల్పనకు సహకరించండి

ఆత్మకూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): అటవీ ఉత్పత్తుల్లో ఒకటైన వెదురుపై ఆధారపడి జీవనం సాగిస్తున్న మేదరులు, ఎరుకలి కులాల ఉపాధి కల్పనకు అటవీశాఖ తరుపున సహకారం అందించాలని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి కోరారు. మంగళవారం నంద్యాలలో నాగార్జునసాగర్ - శ్రీశైలం పెద్దపు లుల అభయారణ్యం ఫీల్డ్ డైరెక్టర్ విజయ కుమార్‌ను ఎమ్మెల్యే కలిశారు. వెదురు సమస్యపై చర్చించారు. నల్లమల అటవీ ప్రాంతంలో లభించే వెదురును సొసైటీల ద్వారా విక్రయించేందుకు చర్యలు తీసుకోవా లని కోరారు. ఎమ్మెల్యే బుడ్డా వెంట కేసీ కెనాల్ ప్రాజెక్ట్ కమిటీ అధ్యక్షులు బన్నూరు రామలింగారెడ్డి తదితరులు ఉన్నారు.


ఫీల్డ్ డైరెక్టర్ విజయకుమార్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

ఎమ్మెల్యేను సత్కరించిన తహసీల్దారు

సైక్లోన్ మొంథా ఫైటర్ అవార్డు అందుకున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డిని ఆత్మకూరు తహసీల్దార్ రత్నరాధిక, డీటీ ఆంజనేయులు సత్కరించారు. మంగళవారం వెలుగోడు మండలం వేల్పనూరులో ఎమ్మెల్యే స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మొంథా తుఫాన్ తీవ్రతను అరికట్టేందుకు ఎమ్మెల్యే బుడ్డా చేసిన కృషిని వారు కొనియాడారు.

క్రీడలతో మానసికోల్లాసం • టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిరోజ్

నంద్యాల హాస్పిటల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ అన్నారు. మంగళవారం పట్టణం నూనెపల్లె మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్ డివిజన్ స్థాయి బాలుర ఆటలపోటీలు హెచ్ఎం చలపతిరావు అధ్యక్షతన డివిజన్ కార్యదర్శి శివకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ హాజరై పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నంద్యాలలో జరిగే ప్రతి ఆటలపోటీలకు తనవంతు సహాయసహకారాలు అందిస్తామన్నారు. నంద్యాలలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటుకు రోడ్‌మ్యాప్ తయారైందని త్వరలోనే అమలు చేస్తామన్నారు. మున్సిపల్ పాఠశాల క్రీడా మైదానం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నంద్యాల డివిజన్‌లోని 13మండలాల నుంచి దాదాపు 500మంది బాలురు పాల్గొన్నట్లు డివిజన్ కార్యదర్శి వి.శివకుమార్ తెలిపారు. విద్యార్థులకు అండర్-17, 14 వాలీబాల్, ఖోఖో, అథ్లెటిక్స్‌లలో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు ఇన్‌చార్జి నాయుడు, మహమ్మద్‌రఫీ, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం కార్యదర్శి బత్తులరవి, వ్యాయామ ఉపాధ్యాయులు శేషు, రాజునాయక్, శ్రీనివాసరెడ్డి, ముజాహిద్, విజయ్, భరత్, శశికళ తదితరులు పాల్గొన్నారు.


జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో ముఖ్య అతిథులు

అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

నందికొట్కూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఎంపీడీవో సుబ్రహ్మణ్యశర్మ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో వయోజన విద్యాధికారి శ్రీని వాసులు ఆధ్వర్యంలో వలంటీర్లకు ఒక్క రోజు శిక్షణ ఇచ్చారు. మెటీరియల్‌పై వలంటీర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీవో, టెక్నికల్ అసిస్టెంట్లు, సీసీలు, బుక్కీపర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

అంచనాలకే పరిమితం

నంద్యాల రూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు ఎప్పుడు కూడా అంచనాలు వేస్తుందే తప్పా రైతులకు నష్టపరిహారం చెల్లించలేదని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామచంద్రుడు విమర్శించారు. మంగళ వారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రైతు లకు న్యాయం చేయాలని ఈనెల 10నుంచి ప్రతి ఏడీఏ కా ర్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేయనున్నట్లు తెలిపారు. నాయకులు రాజశే ఖర్, సురేశ్, రామ్మోహన్ పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలు ఇవ్వాలి

నంద్యాల టౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మూడు నెలల నుంచి ఉపాధి హామీలో పని చేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్లకు జీతాలు రావడం లేదని ఆ సంఘం అధ్యక్షుడు సుబ్బన్న అన్నారు. మంగళవారం స్థానిక డ్వామా కార్యాలయం లో పీడీ సూర్యనారాయణకు వినతి పత్రం అందజేశారు. పెండింగ్ జీతాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు సలావుద్దీన్, సుబ్బరాయుడు, శ్రీహరి, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

నవనంది క్షేత్రాల్లో పారిశుధ్య పనులు

మహానంది, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకొని మండలంలోని నవనంది క్షేత్రాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టినట్లు జిల్లా పంచాయతీ అధికారి లలితబాయి తెలిపారు. మంగళవారం సూర్యనంది ఆలయం పరిసరాల్లో పారిశుధ్య సిబ్బంది పనులను తనిఖీ చేశారు. ఆలయాల పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆమె ఆదేశించారు. ఆమె వెంట డిప్యూటీ ఎంపీడీవో కలువ భాస్కర్ ఉన్నారు.

గిరిజనులకు మౌలిక వసతులు

మహానంది, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): అడవిపై ఆధారపడి జీవించే గిరిజనులకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి శివప్రసాద్ అన్నారు. మంగళవారం మహానంది సమీపంలోని చెంచులక్ష్మీ గూడెంలోని గిరిజనులతో మండల స్థాయి అధికారులు సమావేశం నిర్వహించారు. సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో కలువభాస్కర్, సర్పంచ్ చలం చలం శిరీష, ఉపాధిహామీ పథకం ఎంపీఎం మల్లికా ర్జున యాదవ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కాశీవిశ్వేశ్వరుడి ఆలయానికి విరాళం

మహానంది, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తమ్మడపల్లి కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయం అభివృద్ధికి గ్రామానికి చెందిన చిన్న పాపిరెడ్డి, వీరమ్మ దంపతులు రూ.2 లక్షలు విరాళంగా ఇచ్చినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. కార్యక్రమంలో మహానంది దేవస్థానం మాజీ చైర్మన్ మహేశ్వరరెడ్డి, సర్పంచ్ ప్రతాపరెడ్డి, మాజీఉపసర్పంచ్ శివయ్య, మురళి పాల్గొన్నారు.

నష్టపరిహారం చెల్లించాలి

నందికొట్కూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ వర్షాల వల్ల నష్టపోయిన పొగాకు రైతులకు ఎక రాకు రూ.50 వేలు నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మంగళవారం నందికొట్కూరు శివారులో దెబ్బతిన్న పొగాకు పొలాన్ని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ అఖిల భారత కిసాన్ నాయకులు పరిశీలించారు.

మండల సమావేశాలకు హాజరు కావాలి

వెలుగోడు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : మండల అధి కారులు, ప్రజాప్రతినిధులు అభివృద్ధిపై చర్చించేందుకు మండల సమావేశాలకు హాజరుకావాలని ఎంపీపీ లాలం ర మేష్ అన్నారు. మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యా లయంలో ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించిన సర్వ సభ్య సమా వేశం సాదాసీదాగా జరిగింది. ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. సమావేశంలో ఎంపీడీవో మురారి, తహసీల్దార్ శ్రీనివాస గౌడ్, ఉప ఎంపీపీ చికెన్‌బాబు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

భక్తులతో మర్యాదగా మెలగాలి: ఈవో

శ్రీశైలం నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్ర దర్శనానికి వచ్చే యాత్రికులతో మర్యాదపూర్వకంగా మెలుగాలని ఈవో శ్రీనివాసరావు సూచించారు. ప్రధానంగా టోల్‌గేట్ నుంచి వసతిగదులు, దర్శన టిక్కెట్లు, ఆర్జిత సేవా సమాచారంతో పాటు క్యూలైన్ల వద్దకు చేరుకునే మహిళలు, వృద్ధులకు ఓపికతో సమాధానం చెప్పాలన్నారు.

కార్తీక మాసం ప్రత్యేక పూజలు

నంద్యాల కల్చరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా మంగళవారం పట్టణంలోని పలు శైవ క్షేత్రాలలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ఆకాశ దీపాలు భక్తులు వెలిగించారు. ప్రథమనందీశ్వరాలయంలో దాతల సహకారంతో అన్నదానం చేశారు. కార్యక్ర మంలో చలంబాబు, అర్చకులు ప్రవీణ్‌కుమార్, బొల్లెద్దుల నరసింహ, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

నంద్యాల హాస్పిటల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): భారత హాకీ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని నంద్యాల హాకీ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో భారత హాకీ చరిత్ర-ధ్యాన్‌చంద్ జీవితం అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ నెల 6న ఆంగ్ల వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ నెల 7న ఎస్పీజీ మైదానంలో హాకీ శతాబ్ది ఉత్సవాల్లో భాగం గా నిర్వహించే హాకీ పోటీలకు విజేతలకు లయన్స్‌క్లబ్ సభ్యులు ఆత్మకూరు సుదర్శనం శెట్టి సౌజన్యంతో బహు మతులు అందజేస్తామన్నారు.

మూఢ నమ్మకాలు వీడాలి

గోస్పాడు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చిన్నతనం నుంచే మూఢనమ్మకాలను విడ నాడి సైన్స్‌పై అవగాహన కలిగి ఉండాలని ఎంఈవో అబ్దుల్ కరీం అన్నారు. మంగళవానం గోస్పాడు జడ్పీహైస్కూల్‌లో హెచ్ఎం నాగలక్ష్మి అధ్యక్షతన మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు ఉదయ్‌కుమార్, శ్రీనివాసులు, కళ్యాణి, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గాయత్రి ఆలయ వార్షికోత్సవం

ఆత్మకూరు రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలం కరివేన గ్రామంలో గాయత్రి మాత ఆలయంలో 14వ వార్షికోత్సవ వేడుకలను గ్రామస్థుల ఆధ్వర్యంలో నిర్వహించారు. మంగళవారం ఉదయం వేద పండితులు సత్యనారాయణ శర్మ, ఆలయ పురోహితుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. గ్రామంలోని మహిళలు అమ్మవారికి బోనాల సమర్పించి తమ భక్తి ప్రపత్తులను చాటారు. సాయంత్రం గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

ఆలయాల ముస్తాబు

నేడు కార్తీక పౌర్ణమి



కొలిమిగుండ్ల: విద్యుత్ దీపాల అలంకరణలో శివాలయం

కొలిమిగుండ్ల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి వేడుకలకు కొలిమిగుండ్ల శివాలయంతోపాటు, బందార్లపల్లె నేలబిళం మల్లేశ్వరస్వామి, కాచూటి విశ్వేశ్వరస్వామి, బెలుం సిద్ద రామేశ్వర స్వామి, గుండుమల్లేశ్వరస్వామి, గుండం ఆంజనే యస్వామి ఆలయాలను ముస్తాబు చేశారు. బుధవారం ఆలయాల్లో అభిషేకాలు, జ్వాలా తోరణం, అన్నదానాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు.

రుద్రవరం: మండలంలో బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయాలు ముస్తాబయ్యాయి. రుద్రవరం భాస్కర నందీశ్వరస్వామి, వాసాపురం, దొర్నీ, గుట్టకొండ, నరసాపురం, యల్లవత్తుల గామాల్లోని ఆలయాల్లో కార్తీక పౌర్ణమికి ఏర్పాట్లు చేశారు.

సమస్యల పరిష్కారానికి పోరాటం

డోన్ రూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం పోరాటానికి సిద్ధం కావాలని సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు నక్కి శ్రీకాంత్ పిలుపునిచ్చారు. మంగళవారం ఐసీడీఎస్ కార్యాలయం సమా వేశ భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 17, 18 తేదీల్లో బేతంచెర్లలో జరిగే సీఐటీయూ జిల్లా మహాసభలకు హాజరు కావాలని కోరారు.

ప్రజా సేవలపై నిర్లక్ష్యం వద్దు

ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోట్ల

డోన్ టౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రజా సేవలపై నిర్లక్ష్యం వహించొద్దని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మండలంలోని సచివాలయ సిబ్బందితో ప్రజా సేవల పంపిణీపై సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయాలు ప్రజలకు, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రధాన ద్వారం అని, ప్రతి సిబ్బంది తమ బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తించాలని సూచించారు. ఈ సమావేశంలో సచివాలయ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

పనులు సజావుగా కొనసాగించాలి: నేషనల్ హైవే 340బీ పనులు ఎటువంటి అడ్డంకులు లేకుండా సజావుగా కొనసాగించాలని ఆర్అండ్‌బీ అధికారులను ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి ఆర్అండ్‌బీ, ఫారెస్టు, మెగ పవర్ గ్రిడ్ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. గోరుకల్లు రిజర్వాయర్ ప్రాజెక్టు, రోడ్ల అభివృద్ధి, విద్యుత్ సరఫరా వంటి పనులు సమయపాలనతో నాణ్యతతో పూర్తి కావాలన్నారు.

● **రహదారి పనుల పురోగతిపై ఎమ్మెల్యే ఆరా:** బేతంచెర్ల రోడ్డు నుంచి మాలిక్‌బాబా గుడి వైపు పాతపేట ప్రాంతాలకు వెళ్లే రహదారి మార్గాలను ఎమ్మెల్యే కోట్ల పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రహదారి పనుల పురోగతిని ఆరా తీశారు. రోడ్ల నిర్మాణ, నాణ్యత, డ్రైనేజీ సౌకర్యాలు, పక్కదారుల సమీకరణ వంటి అంశాలపై సంబంధిత అధికారులతో చర్చించారు ఈ సమావేశాల్లో ఆర్డీవో నర సింహులు, డీఎస్పీ శ్రీనివాసులు, డీఎల్‌డీవో నరసింహారెడ్డి, ఎంపీడీవో వెంకటేశ్వర రెడ్డి, తహసీల్దార్ రవికుమార్, సీఐ ఇంతియాజ్ బాషా, కమిషనర్ ప్రసాద్‌గౌడ, డీఈ రఘు, ఏఈ సురేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ హరికిషన్, ఓంప్రకాష్, ఎస్ఐ నరేంద్ర పాల్గొన్నారు.

మహిళా విద్యతోనే సమాజాభివృద్ధి

వయోజన విద్య జిల్లా డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి



వయోజన విద్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

బనగానపల్లె, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మహిళా విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని వయోజన విద్య జిల్లా డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం బనగానపల్లె పట్టణంలోని పొదుపు భవనంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఉల్లాస్ అక్షర ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పొదుపు మహిళలకు, ఏపీఎం కార్యాల యంలో బుక్ కీపర్లకు శిక్షణా తరగతులు నిర్వహించారు. చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి మహిళ విద్యావంతురాలైతే ఆ కుటుంబం, తద్వారా రాష్ట్రం, తద్వారా రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. జిల్లాలో 3 లక్షల 18 మంది నిరక్షరాస్యులుగా ఉన్నట్లు సర్వే ద్వారా గుర్తించామన్నారు. గతంలో నిర్వహించిన అక్షరాస్యులకు నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగరాజు, వయోజన విద్య నోడల్ అధికారి భాస్కర్‌రెడ్డి, ఏడీ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్ ఆదినరసింహులు, ఏపీఎం హజరత్, మండల ఐక్యసంఘం అధ్యక్షురాలు ఫకూర్‌బీ, వయోజన విద్య పొదుపు మహిళా వలంటీర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను విమర్శించడం సరికాదు

ఆళ్లగడ్డ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే భూమా అఖిలప్రియను వైసీపీ నాయకులు విమర్శించడం సరికాదని ఆళ్లగడ్డ మండల టీడీపీ కన్వీనర్ శీలం హరికుమార్ అన్నారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇటీవల తుఫాన్‌తో చాలా మంది రైతులు నష్టపోయారన్నారు. రైతులకు పంట నష్ట పరిహారం ఇప్పించేందుకు ఎమ్మెల్యే సీఎం చంద్రబాబును కలిశారన్నారు. నిజాలు తెలుసుకో కుండా వైసీపీ నాయ కులు ఇష్టం వచ్చినట్లు విమ ర్శించడం మానుకోవాలన్నారు. గత ప్రభు త్వంలో కన్నా ఈ ప్రభుత్వంలో ఇసుక చౌకగా దొరుకుతుందన్నారు. గతంలో రూ.12వేల నుంచి రూ.15 వేలు పెట్టి ఇసుక కొనేవారు అన్నారు. ఇప్పుడు కేవలం టన్ను రూ. 950 ఇసుక లభిస్తుందన్నారు. దాన్ని కూడా తెలుసుకోకుండా విమర్శలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు భాస్కర్, సతీష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హరికుమార్

ఆకట్టుకున్న మాక్ పోలింగ్

ఎన్నికల నిర్వహణపై విద్యార్థులకు అవగాహన



ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్న విద్యార్థులు

కొలిమిగుండ్ల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక మోడల్ స్కూల్‌లో మంగళవారం నిర్వహించిన మాక్ పోలింగ్ అందరినీ ఆకట్టుకుంది. ఎన్నికల నిర్వహణ, పోలింగ్ ప్రక్రియ, ఓటింగ్ విధానం, కౌంటింగ్ పక్రియ తదితర అన్ని అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు మాక్ పోలింగ్ నిర్వహించినట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శివశంకర్ తెలిపారు. ఈ ప్రక్రియలో విద్యార్థులే ఓటర్లుగా .. ఎన్నికల సిబ్బందిగా .. పోలీసులుగా.. పోలింగ్ ఆఫీసర్లుగా విధులు నిర్వహించారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌గా తెలుగు పండిట్ గురప్ప వ్యవహ రించారు. కార్యక్రమంలో ఉపాధ్యా యులు గోవిందు ఫిరోజ్, అరుణ, రాధారాణి, మల్లికార్జున పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలను పెంచాలి

చాగలమర్రి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సామర్థ్యాలను ఉపాధ్యాయులు పెంచాలని ఎంఈవో న్యామతుల్ల సూచించారు. మంగళవారం నగల్లపాడు, చాగలమర్రి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. ఆయా పాఠశాలలో విద్యార్థుల గ్రేడింగ్‌ను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఎంఈవో అనూరాధ చాగలమర్రి లోని ఉర్దూ పాఠశాలను తనిఖీ చేశారు. హెచ్‌ఎంలు మాబుహుసేన్, ధనలక్ష్మి, శ్రీనివాసులురెడ్డి ఉన్నారు.

వైభవంగా ఆకాశ దీపోత్సవం

చాగలమర్రి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని రామలింగేశ్వర ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా మంగళవారం ధ్వజస్తంభం వద్ద ఆకాశ దీపోత్సవం నిర్వహించి, దీపాలు వెలిగించారు. శివపార్వతులకు పూజలు, అభిషేకాలు చేశారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం: చాగలమర్రి లోని భీమలింగేశ్వర ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక పోటీల్లో శివప్రసాద్, శ్రీదేవి దంపతుల కుమార్తె ప్రణవి కూచిపూడి నాట్యంలో ప్రతిభ కనబరిచి పలువురిని ఆకట్టుకుంది. ఆలయ అధ్య క్షుడు వెంకటేశ్వర్లు, ధర్త శివనాగప్ప ప్రణవిని అభినందించి మెమెంటోను అందజేశారు.

ఆలయాభివృద్ధికి రూ.లక్ష విరాళం

చాగలమర్రి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లాల క్షేత్రంలో చెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర ఆలయాల అభివృద్ధి కోసం నవాబుపేటకు చెందిన బి.తిరుమలరెడ్డి, లక్ష్మీ దంపతులు రూ.లక్ష విరాళాన్ని ఆలయ అధ్యక్షుడు నారాయణరెడ్డికి మంగళవారం అందజే శారు. దాతలను ఆయన సన్మానించారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆలయానికి ఎల్ఈడీ బల్బులు..

బనగానపల్లె, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని యనకండ్ల సమీపంలోని ఓ ఫ్యాక్టరీ యాజమాన్యం 2.20లక్షల విలువ చేసే 40 ఎల్ఈడీ బల్బులను యాంగటి ఆలయానికి విరాళంగా అందించారు. మంగళవారం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ పాండురంగారెడ్డి, యాగంటిపల్లె ఉపసర్పంచ్ మౌళీశ్వరరెడ్డిలకు ఎల్ఈడీ బల్బులను అందించారు. ఏసీ పాండురంగారెడ్డి మాట్లాడుతూ యాగంటి ఆలయాభివృద్ధికి భక్తులు విరివిగా విరాళాలు ఇవ్వాలని కోరారు.

మండల సమావేశం వాయిదా

కోవెలకుంట్ల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైతుసేవా కేంద్రంలో మంగళవారం ఉదయం 11గంటలకు ఎంపీపీ రమాదేవి అధ్యక్షతన నిర్వహించాల్సిన మండల సర్వసభ్య సమావేశం కోరం లేకపోవడంతో వాయిదా వేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రకాశ్‌నాయుడు తెలిపారు. ఆయన మాట్లాడుతూ సమావేశానికి రావలసిన ఎంపీటీసీలు గైర్హాజరు కావడంతో కోరం లేక వాయిదా వేసినట్లు తెలిపారు.

హరివరం కుంట వద్ద వన భోజనాలు

ఉయ్యాలవాడ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని హరివరం గ్రామ సమీపంలో ఉన్న మంగలదాని కుంట వద్ద మంగళవారం గ్రామ స్థులు వన భోజనాలు ఏర్పాటు చేశారు. కార్తీక మాసం సందర్భంగా గ్రామస్తులు అంతా కలిసి మంగళవారం మధ్యాహ్నం భోజనాలు ఏర్పా టు చేశారు. ఉయ్యాలవాడ, పడిగెపాడు, నర్సిపల్లె, హరివరం గ్రామాల నుంచి ప్రజలు తరలి వచ్చి వనభోజనాలు చేశారు.

కోవెలకుంట్ల చేరిన భక్తి చైతన్య పాదయాత్ర

కోవెలకుంట్ల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా కర్నూలు నుంచి వేంకటేశ్వరస్వామి రథయాత్రతో భక్తులు కాలినడకన తిరుమలకు బయల్దేరిన పాద యాత్ర మంగళవారం కోవెలకుంట్ల చేరింది. ఈ పాద యాత్రకు భీమునిపాడు గ్రామం పద్మనాభ స్వామి ఆలయ కమిటీ సభ్యులు ఆంజనేయులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శనివారం ఉదయం 7గంటలకు కర్నూలు పాత బస్టాండులోని చెన్నకేశవస్వామి ఆలయం నుంచి భక్తిచైతన్య పాదయాత్ర కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో తిరుమలకు కాలినడకన బయల్దేరడం 14వ సారి అన్నారు.

మహిళల్లో అక్షరాస్యత శాతాన్ని పెంచాలి

ప్యాపిలి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మహిళల్లో అక్షరాస్యత శాతాన్ని పెంచాలని ఎంపీడీవో శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఉల్లాస్ అక్షర ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా వలంటరీ ఉపాధ్యాయులకు అక్షరాస్యతపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ వలంటరీ ఉపాధ్యాయులు గ్రామాలు తిరిగి ప్రతి మహిళకు చదవడం, రాయటం వచ్చేలా చూడాలన్నారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు సరోజమ్మ, ఏపీఎం క్రిష్ణమూర్తి, ఉల్లాస్ అక్షర ఆంధ్ర వలంటీర్లు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి: సీఐ

కోవెలకుంట్ల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కోవెలకుంట్ల సీఐ హనుమంత నాయక్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ముదిగేడు రహదారిలో సీఐ వాహనాల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లైసెన్సులు, సర్టిఫికెట్లు, హెల్మెట్లు ధరించని వారికి జరిమానా విధించారు. సీఐ మాట్లాడుతూ డ్రైవర్లు తప్పనిసరిగా లైసెన్సులు కలిగి ఉండాలన్నారు.

కార్తీక ఉత్సవాల ఆహ్వాన పత్రిక విడుదల



ఆహ్వాన పత్రికను విడుదల చేస్తున్న మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పసుపుల గ్రామ సమీపంలో వెలసిన గుండం మల్లికార్జునస్వామి కార్తీక ఉత్సవాల ఆహ్వాన పత్రికను మంగళవారం మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి విడుదల చేశారు. బనగానపల్లె పట్టణంలోని బీసీ రాజారెడ్డి కార్యాల యంలో ఆలయ చైర్మన్ సిద్ధేశ్వరప్ప కార్తీకమాసం కడ సోమవారం నిర్వహించే పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని బీసీ రాజారెడ్డిని ఆహ్వానిం చారు. ఈనెల 17న అంతర్రాష్ట్ర ఆరుపండ్ల విభాగంలో ఎడ్ల బలప్రదర్శన పోటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు భూషన్న, షేక్షావలి, బాలనాయుడు, మధుసూదన్‌నాయుడు, ఓబులేసు, తిరుపతినాయక్, జయనాయక్, అశోక్ నాయక్ పాల్గొన్నారు.

విజేతకు బీసీ రాజారెడ్డి అభినందన: జెన్‌స్పోర్ట్స్ అండ్ ఆర్ట్స్ అకాడమికి చెందిన సాయి చరణ్‌తేజ కరాటే పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించడంతో మంగళవారం మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి మంగళవారం అభినందించారు. నవంబరు 1, 2 తేదీల్లో కర్ణాటక మైసూర్ చాముండి విహార్ స్టేడియంలో నిర్వహించిన నేషనల్ కరాటే చాంపియన్ షిప్‌లో సాయి చరణ్‌తేజ పాల్గొని కటా కేటగిరిలో గోల్డ్‌మెడల్ సాధించడంతో బీసీ రాజారెడ్డి అభినందించారు. కార్యక్రమంలో అకాడమి కోచ్ సూర్యవంశీ, నంద్యాల జిల్లా కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు కళ్యాణ్‌బాబు పాల్గొన్నారు.

శాస్త్రీయ విజ్ఞానంతోనే దేశాభివృద్ధి



మాట్లాడుతున్న గైనకాలజిస్టు డాక్టర్ సుంకన్న

డోన్ రూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ విజ్ఞానంతోనే దేశాభివృద్ధి సాధ్యమని గైనకాలజిస్టు డాక్టర్ సుంకన్న అన్నారు. మంగళవారం స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెక్‌ముకి పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ సుంకన్నతోపాటు మండల విద్యాధికారులు ప్రభాకర్, రఘు నాయక్ హాజరయ్యారు. డాక్టర్ సుంకన్న మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంచుకుని శాస్త్రీయ సమాజ నిర్మాణంలో పాలుపంచుకోవాలన్నారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర సహాధ్యక్షుడు మాణిక్యం శెట్టి, యూటీఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు నరసింహుడు, ఎస్టీయూ మాజీ రాష్ట్ర నాయకులు షన్మూర్తి, యూటీఎఫ్ సీనియర్ నాయకులు ఎన్ఎస్ బాబు, బీవై సుబ్బరాయుడు, సంజీవరాయుడు, లక్ష్మీనాయక్ పాల్గొన్నారు.

బేతంచెర్ల: విద్యార్థులకు శాస్త్రీయ విజ్ఞానంతో పాటు చదువు కూడా ఎంతో అవసరం ఎంఈవో సోమశేఖర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు శాస్త్రీయ ఆలోచనలతో విద్యాభ్యా సం చేయాలని సైన్స్‌తోనే పురోగతి ఉంటుందని జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముఖి పోటీలు నిర్వహించారు. జన విజ్ఞాన వేధిక జిల్లా నాయకుడు చిన్నయ్య, ఎంఈవో సోమశేఖర్ మాట్లాడుతూ ఈ పరీక్షలో మొదటి ముగ్గురు విద్యార్థులు జిల్లా స్థాయిలో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం హరికృష్ణ ఉపాధ్యాయులు సావిత్రమ్మ, కాంతమ్మ, కృష్ణమోహన్, వెంకటేశ్వర్లు, యూటీఎఫ్ నాయకులు మద్దిలేటి రెడ్డి, మనోహర్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తం

చాగలమర్రి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని ప్రజలు సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యశాఖ నోడల్ అధికారి జగదీష్ చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం చాగలమర్రి ప్రభుత్వ వైద్యశాలలో ఆశా డేను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తుంటంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు ఆయా గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలన్నారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ జ్వరాలపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం పదవీ విరమణ చేసిన సీహెచ్‌వో రమణమ్మను సన్మానించారు. కార్యక్రమంలో వైద్యులు ఇమ్రాన్, అంజలి, హెచ్ఈ విజయభారతి, సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పంచాయతీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ ఎంపీడీవో చంద్రమౌలిగౌడ్ అన్నారు. మంగళవారం ఆయన పంచాయతీ సిబ్బందికి ప్రత్యేక సూచనలు చేశారు. డ్రైనేజీ సమస్యలు, పారిశుధ్య నిర్మూలనపై నిరంతరం పర్యవేక్షించాలన్నారు.

సాంకేతిక విద్యా కేంద్రాలుగా సరస్వతి శిశు మందిరాలు: డీఈవో

బేతంచెర్ల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక విద్యా కేంద్రాలుగా సరస్వతి శిశు మందిరాలు కొనసాగుతున్నాయని డీఈవో జనార్దన్‌రెడ్డి అన్నారు. మంగళవారం సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో దాతల సహకారంతో ఏర్పాటుచేసిన కంప్యూటర్ కేంద్రాన్ని డీఈవో ప్రారంభించారు. ముందుగా సరస్వతి అమ్మవారికి పూజలు చేశారు. జ్యోతిప్రజ్వలన చేశారు. డీఈవో మాట్లాడుతూ విద్యార్థులు విద్యను అభ్యసించే సరస్వతి శిశు మందిరాలు విజ్ఞానంతో పాటు హిందూ సంప్రదాయాలకు నిలయాలని అన్నారు. హైదరాబాదుకు చెందిన ప్రముఖ ఆడిటర్ కేవీ సుబ్రహ్మణ్యం పాఠశాలకు 18 కంప్యూటర్లు బహూకరించారన్నారు. పాఠశాల ఆవర ణలో మొక్కను నాటారు. కార్యక్రమంలో రామకృష్ణ విద్యాసంస్థల అధినేత రామకృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఉప్పాల శివనాగిరెడ్డి, ఎంఈవోలు సోమశేఖర్, అబ్రహం, పాఠశాల కమిటీ కార్యదర్శి మద్దిలేటి స్వామి, ఉపాధ్యక్షులు మధుమోహన్‌రెడ్డి, గోపాల్, హెచ్ఎం తిరుమలేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వదేశీ వస్తువులనే వినియోగించాలి

ప్యాపిలి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): భారతీయులంతా స్వదేశీ వస్తువులనే వినియోగించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందు వెంకటరమణ అన్నా రు. మంగళవారం పట్టణంలో ఆత్మ నిర్బర్ భారత్ సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ నాయకులు ఇంటింటా తిరిగి స్వదేశీ వస్తువుల వినియోగంపై కలిగే ప్రయోజనాలను ప్రజలకు అవగాహన కల్పించారు. బీజేపీ మండల అధ్యక్షుడు దామోదర్‌నాయుడు, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఎగ్జిక్యూటీవ్ మెంబరు కేసీ మద్దిలేటి, రామాంజినేయులు, చంద్రకళ పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన శాలివాహన సంఘం డైరెక్టర్

ప్యాపిలి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): శాలివాహన సంఘం రాష్ట్ర డైరెక్టర్ కుమ్మరి సుధాకర్ మంగళవారం అమరావతిలోని బీసీ భవనంలో రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవితని కలిశారు. శాలివాహనుల సమస్యలను పరిష్కరించాలని మంత్రికి వినతిపత్రం అందజేశారు. మంత్రి స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సుధాకర్ తెలిపారు.

రుద్రవరం మండలంలో వర్షం

రుద్రవరం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం తెల్లవారుజాము నుంచి వర్షం కురిసింది. 16.2 ఎంఎంగా వర్షపాతం నమోదైంది. మొక్కజొన్నలు కోటకొండ, యల్లావత్తుల, రుద్రవరం, చిన్న కంబలూరు, పెద్దకంబలూరు ఇంకా పలు గ్రామాల్లో అకాలంగా వర్షం రావడంతో తడిచి ముద్దయ్యాయని రైతులు వాపోయారు.

24 మంది ఎన్‌సీసీ క్యాడెట్ల ఎంపిక

శిరివెళ్ల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రగుంట్ల గంగుల తిమ్మారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 24 మంది విద్యార్థులు ఎన్‌సీసీ క్యాడెట్లుగా ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ ఇంద్రావతి మంగళవారం తెలిపారు. ఎన్‌సీసీ ఆఫీసర్ షేక్ ఖాసీం సాహెబ్ ఆధ్వర్యంలో కర్నూలు 28-ఏ బెటాలియన్‌కు చెందిన హవల్దార్లు రాకేష్ కుమార్, కేశవ్ థాపా పర్యవేక్షణలో ఈ ఎంపిక నిర్వహించారు. నూతనంగా ఎంపికైన క్యాడెట్లను ప్రిన్సిపాల్ ఇంద్రావతి, వైస్ ప్రిన్సిపాల్ జనార్దనుడు, అధ్యాపకులు అభినందించారు.